# ప్రవాహంలో గడ్డిపోచ

తెలికిచెర్ల ౭. అబ్బర్ ఖాదర్




ఎందుకని అడక్కండి! ఎందుకూ కాకపోయినా నాకదో అలవాటై మాత్రం కూచొంది — వాట్లారుతున్న సూర్యకాంతిలో పల్చనిగాలికలా ఒద్దిగ్గా కదిలే 'రావి — వేప' చెట్లను చూడ్డం!

ఒకనాడు — అలా చూస్తున్నప్పుడు — ఎవరో మనువు బట్టల్లో కొత్త దంపతులు కాబోలు, ఎంతో భక్తితో ప్రదక్షణ చేస్తున్నారు.

అప్పుడు — అక్కడ — హఠాత్తుగ ప్రత్యక్షమైందా అమ్మాయి! ఏం చెప్పేది?

ఏమీ చెప్పక్కర్లేదు. ఇటూ అటూ లయనేసే ముచ్చటైన జడకుచ్చుల్లో ముద్దొచ్చే 'బాలిక' బొమ్మలా ఉన్న ఆ పిల్ల, ఇట్టే కనిపించి అట్టే మాయమైంది!

అలా ... ఓ అనిర్వచనీయ క్షణంలో 'కమల' నా మనసులో కొచ్చింది!

... ... ... ...

ఇప్పుడు లేదు. లేకపోతేనేం? మా చిన్నన్న గంగాధరం చెప్పింది ఇప్పటికే బలికే ఉంది. 'అగ్నిలో కాల్చికొడితే అపరంజి అభరణమౌతుం'దిట! ఎంత మాట! ఇదిగో — మళ్ళెన్నోసా చెప్పా. కవైనా అంతే. కళాకారుడైనా అంతే. అసలు కదిలితేనే ఏ కళైనా! ... ఏదిటో. కమల్ని చూచినప్పట్నుంచీ నాకు ఝుమ్మని కవిత్వం పుట్టుకొస్తోంది! క్షమించాలి... ఇంతకూ కమలెవరో చెప్పనేలేదుకదూ?

ఏవుంది? ఓ బ్రహ్మచారి గదిలో పొట్టకూటి కని పాచిపని జేసే ఫక్తు పదారేళ్ల పడుచుపిల్ల. హన్నా! ఆ సన్యాసిరాజా ఎవరనేరు? నేనే! 'ఆరండ్ బి'లో అప్పర్ డివిజన్ గుమాస్తాగాణ్ని!... అద్సరే. మా గురుడు — అదే మా పై ఆఫీసరుకి మనసైనవుడు ఏమంటాడో చెప్పనేలేదు కదూ! 'యూ, యూ బీ–టు. కాగితప్పొత్తాలమీద పైత్యం పా బోసుకోక ఈ దిక్కుమాల్న ఉజ్జోగాని కెందు కొచ్చావయ్యా నా ప్రాణం తోడేయ్యటానికి.'

అలా ముద్దు చేస్తున్న సదరు ఆఫీసరు ప్రాణం సిక్స్తోయుంటే బహుశా అంతపనీ చేసి ఉండే వాణ్నేమో! అందాత అయన మాటల్ని అట్టే పట్టించుకోకండి.

అప్పట్ను — కమల్ని గురించి... చెప్పాల్సిం దేముందని నాకొక్కోమారు అనిపిస్తుంటూంది. ఐనా చెబుతాను!... కమల ఒకానొక జూనియర్ కాలేజిలో సీనియర్ ఇంటర్ చదూకొంటోంది. అంతవరకు ఎలాగో కుంటినడక నడిచిన కమల చదువు — పరీక్షకు కట్టే ఫీజు దగ్గిరకొచ్చి తక్కున ఆగింది. నిజంగ ఆగిపోయిందనుకోనేరు! నిజానికి అక్కణ్నుంచే ఆ పిల్ల జీవితం ఎంతో వేగంగ, వేగాతి వేగంగ పరిగెట్టటం మొదలెట్టింది.

ఇక్కడ — చిన్న సంగతొకటి చెప్పాలి.

మా డాబామీంచి ఊరవతలి తాటితోపుకూడ కనిపిస్తుంది. సంజ నారంజరంగు నీళ్లలో ఆ తాటితోపు ఇంచక్కా తల పులుముకొంటు న్నప్పుడు — హఠాత్తుగ కమల తన జాలి కథను ప్రారంభించింది... అదీ సంగతి.

కథ — విన్నాను. ఏముంది? మామూలే.

తల్లిదండ్రులా?... లేరు.

ఎలా పెరిగి పెద్దదయిందో... తెలీదు.

ఎలా చదూకొస్తోందో ... తెలేదు. అంతేనా?

వెనకా ముందూ డబ్బూ దస్కం లేనివాళ్లు బతక్కూడదంది. బ్రతికినా మనసున్న మనిషిగా మసలకూడదంది. ఆనందంగా ఉండటం పాపమంది. అందంగ పుట్టటం శాపమంది.

అన్నీ ఒప్పుకొన్నాను.

తనిప్పుడు 'ఒక్క' మనిషి కాదంది. అదీ ఒప్పు... అదిరిపడ్డాను

ఐదు నిమిషాల వరకు నా నోట్లో మాట పెగల్లేదు. కళ్లల్లి చూడబోతే కురిసే మేఘంలా ఉంది కమల. ఏం చేయను?...

ఆ పెదవి విరుపు చెప్పింది.

చెంపల ఎరుపు చెప్పింది.

కన్నీటి మెరుపు చెప్పింది.

కమల మలినంలేని మంచుబొట్టని ...

కానీ, ఈ మానవ సమాజం ఉందే, ఇది చాల విచిత్రమైంది! అంతేకాదు. ఎంత మంచిదో అంత చెడ్డది. ఎంత చెడ్డదో అంత మంచిదీను!

నివ్వటిని కదిలిస్తున్న కమల కన్నీటిబొట్లు నా ఆలోచనల్లమీద పడి పేలిపోతున్నాయి —

"నాకు తెలీదు. ఇప్పటికీ. మూణ్ణెల్ల క్రితం... చీకట్లో ... ఇంటికి దారంట నడుస్తుంటే ఏదో కళ్లు తిరిగినట్టు గుర్తు. పస్తుల్లోకి కాళ్లు చాచిన నేను, స్పృహతప్పి ఎక్కడ పడ్డానో, ఎవరు, ఎప్పుడు, ఎలా, ఎక్కడికి చేర్చారో ...

నా గుండె గాజు గ్లాసులా పగిలిపోయింది. నిన్నటివరకు నిప్పులా ఉన్న నన్ను చూసి, ఇవాళ 'ప్రసూతి కేంద్రం' ఫక్కున నవ్వింది ... అందుకే నేనో నిర్ణయానికొచ్చాను ... "

మళ్లీ అదిరిపడ్డాను.

ఐనా ఇలాంటప్పుడు కడుపుతో ఉన్న పెళ్లికాని ఆడపిల్ల ఇంకే నిర్ణయానికొస్తుంది? ...

" ... జీవితం నుంచి పారిపోవటం ఇష్టం లేక ఇప్పటిదాకా మొండిగా బ్రతికాను. చచ్చి సాధించేదేమిటా అని అనుకొన్నాగానీ ... ఇప్పుడిక దానికంటే గత్యంతరం కనిపించటంలేదు ... "

"క ... మ ... లా ? ... "

"నాకు తెలుసు. నా కోసం నిజంగ రెండు కన్నీటిబొట్లు విడిచేది మీ రొక్కరేనని. అందుకే... అందుకే ఈ గుండె గూడు పెట్టులో మీకో ప్రత్యేక స్థానం ఇచ్చాను ... ఐనా దురదృష్టవంతురాల్ని. వెళ్లిపోవడానికే నిశ్చయించుకొన్నాను ... "

* * *

ఆ తర్వాత సరిగ్గా వారం రోజులకు—దూరంగ ట్రాన్స్‌ఫర్ అయింది నాకు — కాదు నేనే చేయించు కొన్నాను. నిజానికి స్థలం మార్చేగానీ పరిస్థితిలో ఏమీ మార్పులేదు. పాపం, కమల ... దగాపడ్డ కమల్ని తలచుకొంటే ఇప్పటికీ నాకు జాలేస్తుంది. అంత మాత్రంచేత ఆమెను గురించిన ఆలోచనల్లు జీవితాంతం నన్ను అంటిపెట్టుకొనే ఉండాలా?

ఏమో —

గుచ్చుకొనే ఆ చూపు, గుండె లోయల్లో ప్రతిధ్వనించే ఆ నవ్వూ, ఆ శ్వర్య వ రి చే ఆ వ్యక్తిత్వను ... కమల్ని ఇంకెక్కడ మర్చిపోతాను?

ఐతే — ఒకటి మాత్రం నిజం.

ఆదర్శం వంటి లొల్లి కబుర్లు నాకు తెలీవు. అడ్వాన్స్‌డ్ కల్చరా? అసలే తెలీదు. సంస్కరణా చట్టుబండలమాట దేవుడెరుగు.

కానీ, నేను కమల్ని గురించి ఆలోచిస్తున్న మనసున్న అతి మామూలు మనిషినని ఖచ్చితంగ చెప్పగల్ను. అంతే. అంతకుమించి ఇంకేమీ లేదు.

అదృష్టం కొద్దీ ఈ కొత్తవూళ్లో కూడా నాకు డాబా ఇల్లేదొరికింది. డాబా ఇల్లేదొరకటంలో విశేషమేమీ లేదుగానీ, డాబామీదికొస్తే ఇక్కడ కూడా ఒకదాన్నొకటి ఒరుసుకొనే రావి—వేప చెట్లు కనిపించటమే విచిత్రం! ...

వేకువ వెళ్లిపోయిందేమో. పెరట్లో కాకులు అరుస్తున్నాయ్. అంతకంటే శ్రావ్యంగ కొళాయి దగ్గిర సుప్రభాతం వినిపిస్తోంది. బద్ధకంగ నిద్రలేచి కిటికీ తెరిచాను. అంతే —

రావి—వేప చెట్ల కొమ్మల్లోంచి అప్పుడప్పుడే విచ్చుకొంటున్న సూర్యకాంతిలో తలవెంట్రుకలు ఆరబెట్టుకొంటున్న నా భార్య కమల మెళ్లో తళుక్కున మెరిసిన బొట్టుగొలుసు — మనసుకు అంటని మాలిన్యాన్ని, మానవత్వాన్ని గూర్చి మౌనంగ ఉపదేశిస్తోంది! ... ★